# నాతి చరామి

'ధార్మిక, ఆర్థిక, వాంఛా, మోక్ష కారణాల వల్ల కూడా నేను నిన్ను వదిలి పెట్టను' అని అగ్ని సాక్షిగా ప్రమాణం చేయటం మన పెళ్ళిళ్ళలో ముఖ్యాంశం. దీనికి అర్థం చెప్పాల్సిన పనిలేదు. పెళ్ళి చేసుకున్న, పెళ్ళిళ్ళు చూసిన వాళ్ళందరికీ బాగా తెలిసిన అర్థమే. కానీ నా బాణీలో ముచ్చటగా మూడు వాక్యాల్లో చెప్పాలంటే, దేవుడు కనపడి మన ధర్మాలన్నిటిలోకీ ఎంతో వాంఛనీయమైన మోక్షమిస్తానన్నప్పుడు కూడా, మన కోరికలనీ, జేబులో పుడుతున్న దురదనీ ఆపుకుని, 'కొంచెం ఆగండి సార్. మా ఆవిడని కూడా తీసుకువస్తాను. అదేదో ఇద్దరికీ కలిపే ఇద్దురుగాని' అని అంటానని మొగుడుగారు, అగ్నిహోత్రం పొగకి కళ్ళల్లో నిలిచిన ఆనంద భాష్పాలతో పెళ్ళినాటి ప్రమాణాలు చేస్తాడని.

కానీ ఇక్ష్వాకుల కాలంనించీ ఇక్కడో తిరకాసు వుంది. ఎవరో చాకలాడు ఏదో అన్నాడని తను అగ్ని మీద పెట్టిన ఒట్టు గట్టు కెక్కించేసి, రాముడు సీతని వదిలేశాడు. (పదవీ వ్యామోహమండీ. అగ్నిప్రవేశం చేసి తన పాతివ్రత్యాన్ని నిరూపించుకున్న తర్వాత కూడా రాముడికి భార్యకన్నా, రాజ్యపాలనే కావలసి వచ్చింది అంటాడు మిత్రుడు రామరావు) జూదమాడుతూ పెళ్ళాన్నే పణంగా పెట్టారు మన డి. రాజుగారు. (పేకాట పాపారావులకి ఒళ్ళు తెలీదు మరి) ఆర్థిక ఇబ్బందులకు గురయి పెళ్ళాన్నే అమ్మేశాడు శ్రీ యస్. హరిశ్చంద్రుడు. (అర్థేచ అని అగ్ని సాక్షిగా చేసిన ప్రమాణంలో వున్నా మాట తప్పిన ఈ అప్పారావు)

కన్యాశుల్కం రోజుల్నించీ, కట్నాల గిట్నాల ఈనాటి దాకా మన మగ మహారాజులు ఈ మహానుభావుల అడుగు జాడల్లో నడుస్తున్నారు. అందులో, మానవత్వం ఏమాత్రం లేకపోయినా, ఆశ్చర్యం మాత్రం లేదు!

0 0 0

చి.సౌ. నమీతా జైన్‌ని, చి. పంకజ్‌కి ఇచ్చి పెద్దలు వివాహం నిశ్చయించారు కనుక మీరంతా బంధు మిత్రులతో వచ్చి, వధూవరులని ఆశీర్వదించమని ప్రార్థిస్తున్నాము అని శుభలేఖ సారాంశం. ఇక్కడ గమ్మత్తేమిటంటే, నమీతని పంకజ్‌కి ఇస్తున్నారు. ఆమెతోపాటూ ఎంతో కట్నం, దానికి మించిన గిట్నం కూడా ఇస్తున్నారు. మరి పంకజ్ అదంతా తీసుకుని, నమీతకి ఏమిచ్చాడో చూద్దాం.

అశోక్ అనే ఆయన నమీత కుటుంబానికి దగ్గర చుట్టం. అలాగే పంకజ్ వేపు కూడా అతనికి చుట్టరికం వుంది. మనవేపు సహృదయులైన మన చుట్టా లందరిలాగానే, ఈ ఇద్దరికీ సంబంధం కలిపితే బాగుంటుందనిపించింది అతనికి. అందులోనూ వధువు కెనడాలో గొప్ప ఉద్యోగంలో వున్నాడు. అందంగా వుంటాడు. ఇక కావలసిందేముంది. కాకపోతే అడిగిన పది లక్షల కట్నం, లాంఛనాలూ, పెళ్ళి

ఖర్చులూ ఎక్కువే మరి. జైన్‌గారికి ఒక్కగానొక్క కూతురు సుఖంగా వుండటమే కదా కావలసింది. ఎలాగో క్రిందా మీదా పడి పెళ్ళి జరిపించటనికే నిశ్చయించుకున్నాడు.

కుర్రవాడు ఆఘమేఘాల మీద కెనడానించీ భారతానికి రావటం, పెళ్ళి చూపులు, పెళ్ళీ చకచకా జరిగిపోయాయి. పెళ్ళి ముందురోజు నిశ్చితార్థం రోజునే, ఎన్నో నగలు దగ్గరి చుట్టాలకీ దూరపు చుట్టాలకీ ఇచ్చుకున్నారు. పెళ్ళి జరుగుతు న్నప్పుడు తండ్రి మగ మహారాజు వియ్యంకుడిని పక్కకి తీసుకువెళ్ళి, తన మహా సుతుడి బరువు కనీసం ఇంకో పదిహేను లక్షలు పలుకుతుంది (మరి విదేశీ వరుడు కదా), మరి మీరేం పలుకుతారు అన్నాడు. అప్పటికే నిండా మునిగివున్నాడు కనుక, ఇంకేమీ పలకటానికి అతనికి నోట మాట రాలేదు. గుమ్మడిలా గుండె పట్టుకుని కూలబడ్డాడు. అశోక్ భాయ్ ఎంత నచ్చ చెప్పినా, పంకజ్ నాన్న నహీనహీ అన్నాడు. తల తాకట్టు పెట్టయినా పెళ్ళి జరిపించటం ముఖ్యం, బంధుమిత్రుల ముందు మన పరువు ప్రతిష్టలేమవుతాయి అనుకుని, అబ్బాయి చేత నాతి చరామి అనిపించారు. పెళ్ళయే దాకా ఆ విషయం నమీతకి తెలియనివ్వలేదు.

నూతన వధూవరులు ప్రేమయాత్రలకి వెళ్ళిన మర్నాడే తండ్రి మహరాజు కుర్రాడిని వెనక్కి పిలిపించాడు వచ్చే వారం వెళ్ళిపోతున్నావు కదా మాతో వుండరాదా ఈ నాలుగు రోజులూ అని. కెనడా కుర్రాడి మెడ మీద తల సరేనంటూ వూగింది. వెంటనే గొర్రెలా తలా తోకా వూపుకుంటూ ముందు వాళ్ళ వూరికీ, తర్వాత కెనడాకీ వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళాక నమీతని కెనడాలో అతని ఇంటికి కాకుండా, అత్తగారింటికి పంపించారు. మరి కట్నం బాకీ పదిహేను లక్షలుంది సార్! అదెవరిస్తారనుకుంటు న్నారు. ఆమె చేత పదిహేను లక్షల విలువ చాకిరీ చేయించుకున్నా రనుకుంటున్నారా? లేదు. కొన్నాళ్ళు అన్ని పనులూ చేయించుకుని, ఇంకా ఎందుకు తిండి దండగ అని, నువ్వు పుట్టింటి భార్యవి అవుగాక అని దీవించి సాగనంపారు.

పంకజ్ ఇచ్చిన ఫోన్ నెంబరూ సరైనది కాదు, అతని అడ్రస్సూ అసలైనది కాదు. 'అతను నన్ను చూడకుండానే, నాతో ఏమీ మాట్లాడకుండానే పెళ్ళికి ఒప్పేసు కున్నాడు... అప్పుడే నాకేదో అనుమానం..' అంటుంది నమీత.

నమీత ఏమీ తెలియని అబల, పల్లెటూరి పిల్ల కాదు. చదువుకున్న సిటీ అమ్మాయే. తెలివైనది. నా కళ్ళకీ, మా ఆవిడ కళ్ళకీ ఎంతో అందంగా, చక్కగా, సలక్షణంగా వుంది. మరి సంప్రదాయ కుటుంబంలో మంచి విలువలతో పెరిగిన ఆమె, తను చేయని తప్పుకి శిక్ష అనుభవించాలా?

0 0 0

అదే సమయానికి పంజాబ్‌లోని చండీఘర్‌లో, సోనియా కౌర్ అనే భావి భారత పెళ్ళికూతురుకి కూడా పెళ్ళి నిశ్చయమయింది. వరుడు కూడా అందరూ కోరుకునే విదేశీ వరుడే కెనడా నివాసి. నెలకి కొన్ని లక్షల రూపాయలు జీతం. (అలా డాలర్లని రూపాయల్లోకి మార్చితే, ఇక్కడ ఖర్చూ లక్షల మీదే వుండి, చివరికి మిగిలేది చిల్లరే! అది మనవాళ్ళు తమ లెఖ్ఖల్లో ఎందుకు చూడరో, నాకు మాత్రం

అర్థం కాదు)

మరి అంత గొప్ప మగ మహారాజుకి, కనీసం పదివేలు... పదివేల రూపాయలు కాదు డాలర్లు కట్నంగా ఇవ్వకపోతే మర్యాదగా వుండదు. అందుకే వాళ్ళు తాళి కట్టటానికి పదివేల డాలర్లు అడగటంలో తప్పేముంది. అడిగారు. అంతే కాదు ఇంకా ఎక్కువ ఇచ్చి ఆ సంబంధాన్ని తన్నుకుపోవటానికి ఎంతోమంది సిద్ధంగా వున్నారు, ఆలసించిన ఆశాభంగం అన్నారు. అంటే సేల్ అన్నమాట. 25 శాతం గొప్ప తగ్గింపు. ఈ రోజు మాత్రమే అన్నారు. తనకి ఎంతో కష్టమే అయినా, అల్లారు ముద్దుగా పెంచిన ఒకే ఒక కూతురికి, ఎలాగైనా సరే ఇంత చక్కటి సంబంధం చేయాల్సిందే అని సరేనన్నాడు తండ్రి. ఇక అబ్బాయి కెనడానించీ రావటమే తరువాయి. పెళ్ళిచూపులు కూడా లేకుండానే అందరూ నిశ్చితార్థం చేశారు. ఫొటోలో బాగానే వున్నాడు అనుకుంది సోనియా.

ఈలోగా అబ్బాయి తాతయ్యగారు ఒక బక్కెట్ కాళ్ళ దగ్గర పెట్టుకుని దాన్ని తన్నటానికి సిద్ధమయాడు. పోతూ పోతూ తన మనవడి పెళ్ళి చూసి పోవాలనీ, చూడకపోతే నరకానికి పోతాడని ఒక జ్యోతిష్కుడు చెప్పాడనీ, మంచం మీద పడుకుని లేస్తూ పడుతూ చెప్పాడు. లేచినవాడు హిందీ సినిమా తాతయ్యలా క్రింద పడి ఇక లేవకుండా పోతాడేమోనని, సరేనయ్యా నీ మనవడి ఫొటోతో అతని పెళ్ళి చేసి, నిన్ను స్వర్గానికి పంపిస్తాం అని మాట ఇవ్వగానే ఆయన ఇక క్రింద పడటం మానేశాడు. ఇదేదో సరదాగా వ్రాసిందీ, ఏ ఇక్ష్వాకుల కాలంలోనో, ఏ అనాగరిక దేశంలోనో జరిగిందీ కాదు. 21వ శతాబ్దంలో మన దేశంలోని పంజాబ్ రాష్ట్రంలో, సోనియా కౌర్‌కి ఆశీష్ ఫొటోకీ, అగ్నిసాక్షిగా పెద్దల సమక్షంలో, పదివేల డాలర్ల కట్నంతో పెళ్ళి చాల ఘనంగా జరిగింది. శుభం.

తర్వాత నెల రోజులకి ఆశీష్ కెనడానించీ దిగుమతి అయాడు. ఎలాగూ వచ్చాడు కదా మళ్ళీ నిజంగా ఇద్దరు మనుష్యులతో పెళ్ళి జరిపిస్తే ఎలా వుంటుంది అన్నాడు చావకుండా బ్రతికిన తాతయ్య. అవును మనది కానప్పుడు మంగళగిరినించీ, మంగుళూర్ దాకా దేకమన్నారు. అందుకని మునిగిపోయిన సోనియా నాన్నగారిని, నిండా మునిగావు కదా నీకు చలేమిటి మళ్ళీ కానియ్యమన్నారు. అందరి ముందూ అలుసయిపోవటం ఇష్టం లేని అతనికీ తప్పలేదు. మళ్ళీ కొన్ని లక్షలతో పెళ్ళి జరిపించారు.

'ఫొటోలో కన్నా కూడా బాగున్నాడు ఆశీష్' అంది సోనియా.

పదిహేను రోజులు ఇద్దరూ చక్కగా 'కాపురం' చేశారు.

అలా చేస్తున్నప్పుడే అన్నాడు పిల్లాడి తండ్రి - 'ఇంకో పదివేల డాలర్లు ఇస్తే సరిపోతుంది, ఇటు ఇక్కడ మా ఖర్చులకీ, మీ అమ్మాయి కెనడా టిక్కెట్టుకీ, మిగతా చిల్లర ఖర్చులకీ' అని.

దాంతో సోనియా బంగారు కలలు కళ్ళ ముందే కరిగిపోయాయి.

తరువాత ఏమయిందీ, వచ్చే వారం చూద్దాం.

0 0 0